## మన(సు)లో మాట

పాఠకులందరికీ సంఘమిత్ర విజయదశమి మరియు దీపావళి శుభాకాంక్షలను తెలియజేస్తోంది. సంఘమిత్ర స్వచ్ఛంద సేవకులందరూ పని వత్తిడి వలన ముందు అనుకున్నట్లు అన్ని శీర్షికలూ కావలసిన విధముగా సమకూర్చుటకు వీలు పడలేదు. సంఘమిత్ర ఈసారి కూడా అతి తక్కువ శీర్షికలతో విడుదల చేయడం జరిగింది. సంఘమిత్ర సంచికలోని అచ్చు తప్పులను సరిదిద్దడానికి, శీర్షికలను కావలసిన రీతిలో సమకూర్చుటకు స్వచ్ఛంద సేవకులను ఆహ్వానిస్తున్నాము. వచ్చేసంచిక ఎక్కువ శీర్షికలతో ఆకర్షణీయముగా రూపొందించడానికి సన్నాహములు చేస్తున్నాము. సంఘమిత్ర బృందం మీ ఆసక్తికి, శీర్షికలు పంపుటద్వారా సంఘమిత్ర పత్రిక వెలువరించడానికి పాలు పంచుకొంటున్నందుకు హర్షాన్ని వ్యక్తం చేస్తున్నది. సంఘమిత్ర త్రైమాసిక పత్రిక ఐదు సంవత్సరములు పూర్తి చేసిన సందర్భములో శుభాకాంక్షలు పంపిన పాఠకులకు ధన్యవాదములు.

చాలామంది సంఘమిత్ర స్వచ్ఛంద సేవకులు ధ్యాన శిబిరంలో పాల్గొనడానికి ఇండియా వెళ్ళడము వలన గత సంచిక, ఈ సంచిక ఆలస్యముగా విడుదల చెయ్యడం జరిగింది. ఈ విషయమునకు మేము మనస్ఫూర్తిగా క్షమాపనలు తెలియజేస్తున్నాము. సంఘమిత్ర స్వచ్ఛందసేవకులలో ఒకరు అమెరికాలోని ఒక ప్రాంతములోని పాఠశాలలో బోధనా పద్దతులను మార్చడానికి ఆ కార్యవర్గానికి సిఫారసు చేసియున్నారు. ఆయన అందజేసిన అతి విలువైన సూచనలను పాఠశాల కార్యవర్గం అంగీకరిస్తే అది విశేషమైన ప్రగతిగా పరిగణించవచ్చు. ఈ విషయముగురించి విషయములు తెలిసిన వెంటనే పత్రికలో ప్రచురిస్తాము.

అమెరికాలోని ఆర్థిక సంక్షోభము, మిగిలిన దేశములలో దీని ప్రభావమువలన ఎంతోమంది ఉద్యోగులు గడ్డుకాలమును ఎదుర్కొంటున్నారు. త్వరలో ఈ ఆర్థిక సంక్షోభమునుండి బయటపడి, ఉద్యోగుల పరిస్థితి మెఱుగుపడాలని ఆకాంక్షిస్తున్నము. ఆశ, ఆత్మవిశ్వాసము ఎన్నటికి కోల్పోరాదు. ఈనాటి పరిస్థితిని ధైర్యముతో ఎదుర్కొనడానికి కావలసిన శక్తిని ఇవ్వమని దైవాన్ని ప్రార్థిద్దాము.

చాలామంది పాఠకులు ముఖచిత్ర కథనము బాగుందని చెప్పారు. ముఖచిత్రము కళాత్మకమైన చిత్రమునకుగాని, ప్రకృతికి సంబంధించిన చిత్రమునకుగాని కేటాయించమని తెలియజేసారు. రానున్న సంచికలలో వారి సూచనను తప్పక అమలు చేస్తాము. 'జనపథం - జనపదం', 'ఆచారములు - అంతరార్థములు' మొదలైన అంశములు లేనందుకు విచారం వ్యక్తంచేసారు. ఈ విషయములో మా ప్రయత్నం మేము చేస్తున్నాము. కాని, అనివార్య కారణముల వలన అది వీలు పడలేదు. దయచేసి ఈ అసౌకర్యమును మన్నించమని ప్రార్థన.

గత సంచికలో విజ్ఞానమును నలుగురితో పంచుకోవడము గురించి మన(సు)లో మాటలో వ్రాసిన విషయములను ప్రస్తుతిస్తూ కొందరు విజ్ఞులు వ్రాసిన ఉత్తరములకు ధన్యవాదములు. మీరు మీ ఆలోచనలను పాఠకులతో పంచుకోవాలని అనుకుంటే ainapura@yahoo.com కి ఈ-మెయిలు పంపండి.

మళ్ళీ జనవరి సంచికలో కలుద్దామా! అంతవరకు సెలవు. అభినందనలతో ...

సంఘమిత్ర సంపాదక వర్గం.